# సర్వేజనాః సుఖినోభవంతు

ఆమె ఒక గులాబీ పువ్వు అని కొంతమంది అంటారు. కాదు ఆమె ఒక గులాబీ మొగ్గ అని అంటారు. ఆమె మేని వర్ణం చూసిన చాలామంది, సంపంగి పుష్పంతో పోలుస్తారు. శ్వేత మేఘం, విద్యుల్లతల గాంధర్వ వివాహ సుందర పరిణామమే 'ఆమె' అని కవులు వర్ణిస్తారు. ఆమె ఎవరో తెలియని వాళ్లు, ఆమె సుందర వేణీభారం అవలోకించి, ఆమె పేరు తప్పక 'సుకేశిని' అయివుంటుందని అనుకుంటారు. ఆ మనుషులే, ఆమె కళ్లు చూసి, ఆమె పేరు విశాలాక్షీ, పద్మాక్షీ, సులోచననో లేక హిందీ సినిమాలోని సునైనానో అయివుంటుందని అనుకుంటుంటారు. ఆమె మందహాసం వీక్షించి, ఆమెను సుస్మిత, లేక సుహాసిని అని పిలవాలని తహతహలాడతారు. పౌరాణిక పండితులు, చిన్న ముద్రారాక్షసానికి అభ్యంతరం చెప్పకపోతే ఆమెకు ''కుచ దేవయాని'' అని నామకరణం చేయటంలో అసమంజసం వుండదు. ''ఉడురాజముఖి'' ''మృగరాజకటి'' అని విశేషణ పదాలతో ఆమెను వర్ణించడంలో తప్పులేదుగాని అది చాల పురాతన పద్ధతి గదా! కాని, ఆమె మొత్తం శరీరాన్ని లెక్కలోకి తీసుకొని ఆమెను ''ప్రియదర్శిని'' అనిగాని ''త్రిపుర సుందరి'' అనిగాని పిలిస్తే, దానిలో అతిశయోక్తి వుందని కళ్లున్న మనుషులెవ్వరూ చెప్పరు.

ఈ విధంగా ఎన్నో పేర్లకు అర్హురాలయిన ఆమె అసలు పేరు తెలుసుకోవాలని మీకు చాలా కుతూహలంగా వుంది కదూ!

మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్‌లో ఆమె పేరు ''ఎలిజబెత్'' అని వున్నా, తల్లిదండ్రులు ఆమెను ముద్దుగా పిలిచేది 'సవిత' అని. ఆమె తల్లికూడా చాలా అందగత్తె. 'ఎలి' అమ్మమ్మ కూడా ఇంకా బ్రతికే వుంది. డెబ్బై దాటిన ఆ ముసలమ్మకు, అరవైకంటే ఎక్కువ

వుంటుందని ఎవరూ అనుకోరు. ఈ వయసులో కూడా ఆమె పూర్వకాలపు రూప సౌకుమార్య లక్షణాలు ఆ వదనంలో ప్రత్యక్ష ప్రచ్ఛన్న విధాలుగా గోచరిస్తాయి. - అంటే ఆమె పాతకాలపు అందం ఈ నాటికి దోబూచు లాడుతుందన్న మాట. ఆమె సుందరి, ఆమె కూతురు అతి సుందరి, ఆమె కూతురు కూతురు అతిలోక సుందరి, అని ఈ మూడు తరాలవాళ్ల గురించి వృక్షశాస్త్రంలో అ, ఆ, ఇ, ఈ, తెలియని వారు కూడా వీరిని పొగడుతూ వుంటారు, వీళ్ల వంశంలో ఎక్కడో 'పోర్చుగీసు' వారి రక్తం కలిసి వుండవచ్చని వీరి దూరపు బంధువులకు ఒక దురభిప్రాయం వుంది.

ఎలిజబెత్ ఇప్పుడు హైద్రాబాదులో ఒక పెద్ద ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూంది. ఏ ఆసుపత్రిలో, ఏ విభాగంలో ఆమె పని చేస్తుంది - అనే విషయాలు మనఃపూర్వకంగా తెలపడం లేదు. ఎందుకనగా! వివిధ రకాల సమస్యల చిక్కు ముడులలో ఇరుక్కుపోయి వున్న ఆ అప్సరసను ఆసుపత్రిలో అనవసరంగా వచ్చి సందర్శించే వారి సంఖ్యను పెంచడం ఎందుకని!

సమస్యలు అనే విషయానికి వస్తే అవి ఆమెకు తోబుట్టువులు. కాని ''దేవుడా! నన్ను నా శ్రేయోభిలాషుల నుండి కాపాడు'' అని ఆమె చేత ప్రార్థనలు చేయించే వాళ్లే ఆమెకు ఈ సమస్యలను తెచ్చిపెట్టేది. ఆ పీడల్ని ఎదుర్కొనే సమయాల్లో కూడా ''జూహీ చావ్లా'' లాంటి నిష్కళంకమైన ముఖంలో నలభై వాట్ల ప్రకాశం ఇస్తున్న నాలుగువాట్ల బేబీ ట్యూబ్‌లైటు వెలిగించినట్లు ఒక చిరునవ్వు సదా లాస్యం చేస్తుంది.

'రోమియో'ల నుంచి ఆమెకు ఎక్కువ ఇబ్బంది కలిగేది --- ఆమె ప్రొఫెషనరీ నర్సుగా పని చేసినప్పుడు. ఇతర ఉద్యోగులను -- ఏదో ఒకటి చెప్పి తప్పించుకోవచ్చు, కాని నైట్‌డ్యూటీలో పని చేసే సందర్భాలలో కొంత మంది హౌస్ సర్జన్ల అయిష్టత సంపాదించుకోవడం మంచిది కాదేమోనని ఆమెకు అనిపించింది. ఉద్యోగంలో తన పురోగతి కొరకు, వ్యక్తి పరమైన తన భవిష్యత్ ఐశ్వర్యం కొరకు కొన్ని సడలింపులకు సిద్ధం కావడమే ఉత్తమమని ఆ యువతి తెలుసుకుంది. ఆమెకు స్నేహితురాలిలాగా వున్న ఆమె తల్లి, ఈ విషయంలో ప్రాయోగికపరమైన కొన్న సలహాలు కూడా ఇస్తూ వుండేది.

అవివాహితయైన ఒక తరుణీమణి తీసుకోవలసిన అన్ని ముందు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ఎవరితో శత్రుత్వం సంపాదించ కుండా, అందరి మన్ననలను పొందే టట్టుగా నడచుకోడానికి ఆమె కొన్ని కిటుకులు నేర్చుకుంది. కాలక్రమేణా, ఆమెకు కొంచెం చెడ్డపేరు వచ్చింది కాని, అది ఎక్కువగా పెరగలేదు. దానివల్ల, ఎవరికి కూడా ఆమెపట్ల ఇష్టం తగ్గలేదు. ఆమెను తెలిసిన వాళ్లందరికి, ప్రత్యేకంగా పురుష వర్గానికి, ఆమెపట్ల

మామూలు ప్రీతి కాదు అమితమైన ప్రీతి వుండేది. వాళ్లల్లో చాలా మందికి, కలల్లో ఆమె దూసుకు వచ్చేది. మామిడికాయ, నిమ్మకాయ, చింతకాయలను తలుచుకుంటేనే నోట్లో నీళ్లూరినట్లు, ఎలిజబెత్ పేరు తలుచుకుంటేనే, కొంతమంది యువకుల నోట్లో వరదలొచ్చేవి. ఆమెలో ఏవైనా దోషాలు, లోపాలు వున్నా, ఆ లోపాలు దోషాలతో సహా, ఆమెను స్వీకరించడానికి చాలా మంది మంచి యువకులు సిద్ధంగా వుండేవారు.

అలాంటి వాళ్లల్లో, ఆమెకు చాలా దగ్గరగా వచ్చిన అందగాడు, మరియు డబ్బుగాడైన, ఎం.బి.బి.యస్ వాడు డాక్టరు భరత్ భూషణ్. అతను కాలేజీలో చదువుకునే రోజుల్లో కూడా స్వంత ఫియట్ కార్లో వచ్చేవాడు. అతనితో చదువుకున్న చాలామంది 'ఎం.బి.బి.యస్' అమ్మాయిలు అతని ఆరాధక బృందంలో వుండేవారు. కాని, హౌస్ సర్జన్సీకి రావడంతో ఎలిజబెత్ అతని కంట బడడం, ప్రథమ దర్శనంలోనే ఆమెకు బానిస కావడం జరిగిపోయాయి. ఎలిజబెత్‌కు పరవాలేదు, ప్రథమ దర్శనంలో ఆమెకు చాలా మందితో ప్రేమ ఏర్పడడం అనేది మామూలే.

అతని నైట్ డ్యూటీ రోజుల్లో, ఆసుపత్రిలోపల. ఆమెకు నైట్ డ్యూటీలేని రోజుల్లో హోటల్ రూమ్‌లో, మరింత ఎక్కువ సమయం అతని కారులోనే ఆమె అతనితో దగ్గర రావల్సిన దానికంటే, ఇంకా ఎక్కువ దగ్గర రావడం జరిగింది.

ఆయువకునికి ఆ అమ్మాయి గతచరిత్రగాని, ''వివాహ పూర్వ పాతివ్రత్య రాహిత్యంతో'' గాని పట్టింపులేదు. ఆమెను ''యాసీస్ వేరీస్ కండిషన్'' లో స్వీకరించటానికి అతను సిద్ధంగా ఉన్నాడు. ఆమె దివ్య సౌందర్యంతోపాటు, అంతకు పదిరెట్లు శోభను వెలార్చే ఆమె మందస్మితం అతన్ని ఆకట్టుకొంది.

భరత్ భూషణ్ తల్లిదండ్రులు ఈ పెండ్లికి వ్యతిరేకంగా ఉన్నారు. ఆ అమ్మాయి ప్రవర్తనపట్ల వాళ్ళకి తీరని అసంతృప్తి ఉన్నా, ఆమె హిందువు అయితే ఇంత వైముఖ్యం ఉండేదికాదు -- తమ కులానికి చెందిన అమ్మాయి కాకపోయినా సరే -- కానీ చేసేదేముంది? తమ ఏకైక కుమారుడి జీవితంలో అతి ప్రధానమైన నిర్ణయాన్ని దిద్దటానికి ఆ తల్లిదండ్రులకు శక్తిలేదు. అంతేగాక తమ కుమారుని వివాహం ఎంత శీఘ్రంగా జరిగితే వాళ్ళకంత సంతోషం. మత్తుమందులకు, మద్యపానానికి బానిసయైన తమ కుమారుని జీవితాన్ని సంస్కరించే సామర్థ్యంగల ఒక అమ్మాయి త్వరగా లభించాన్నదే వాళ్ళ అభిలాష. భార్య అభిమతానికి తమ కుమారుడు మెల్లమెల్లగా లోబడి పోతాడనే వాళ్ళ శుభ ప్రతీక్ష. అంతసామర్థ్యంగల అమ్మాయి లభిస్తే తమ కుమారుని చక్కదిద్దటమేగాక, పేరు ప్రసిద్ధి పొందే ఒక మంచి డాక్టరుగా కూడా తీర్చిదిద్ద గల్గుతుందనేది వాళ్ళకే దృఢంగాని ఒక దృఢ

విశ్వాసం. ఒక యువ డాక్టర్‌కు డాక్టరింగ్ చేయటానికి ఒక అందమైన నర్సుకు సాధ్యంగాక వేరెవ్వరివల్ల అవుతుంది? ఎట్టకేలకు ఈ వివాహానికి తల్లిదండ్రులు సమ్మతి తెలిపారు. వధువు క్రిస్టియన్‌గాబట్టి వివాహం చర్చిలోనే జరగాలని ఆమె తల్లిదండ్రులు పట్టు బట్టలేదు. సిటీలో ప్రసిద్ధి పొందిన ఒక హోటల్‌లో ఈ వివాహం, తదనంతర విందు మొదలగు కార్యకలాపాలన్నీ ఖర్చుకు వెనకాముందూ ఆడకుండా ఏర్పాటు చేయటం జరిగింది. జనవరినెల పదునాల్గవ తేదీ సాయంత్రం ఏడూనలభై అయిదుకు ముహూర్తం. పదమూడవ తేదీ సాయంత్రం మరునాటి వరుడు, తనకు కాబోయే వధువు గృహానికి వెళ్ళటం జరిగింది. రెండు గంటలపాటు జంట చాలా ఆహ్లాదంగా గడిపారు. ఇంతవరకూ భయంగా, బిడియంగా కలుసుకొనే ఆయువ జంట, ఇహ ఇరవైనాలుగు గంటల తర్వాత తాము శాశ్వతంగా కల్సి ఉండటానికి కావాల్సిన లైసెన్స్ లభిస్తుందని బంతులవలె గంతులేయ సాగారు సంబరంతో. మరుసటి రాత్రి అనుభవించబోయే మాధుర్యం గూర్చి తీపికలలు కంటూ, వేడి చుంబనాల వర్షం కురిపిస్తూ, మనసులేని మనసుతో ఆమెను విడిచి వెళ్ళాడు.

ఇంటికి వచ్చిన కుమారుని పట్టలేని ఆనందం చూసి ఆ తల్లిదండ్రులెంతో మురిసిపోయారు. యథాప్రకారం అలవాటుగా మూడు, నాలుగు పెగ్గులు విస్కీ తీసికొని డిన్నర్ టేబిల్ దగ్గర కొచ్చిన కుమారునితోపాటు వాళ్ళుగూడా సంతోషంగా భోజనం చేశారు. ''గుడ్‌నైట్ డాడీ'', ''గుడ్‌నైట్ మమ్మీ'' అంటూ తన పడక గదికి వెళ్తున్న తనయునితో ''గుడ్‌నైట్ సన్నీ'' అని తల్లి చెప్తున్నప్పుడు, ''స్వీట్ డ్రీమ్స్'' అంటూ తండ్రిగూడా వంత పలికాడు.

మరునాటి ఉదయం 'ఏడున్నరగంటలైనా అబ్బాయిగది తలుపు తెర్చుకోకపోవటంతో --- ఏడు నుండి ఏడున్నర గంటలవరకూ మూడు సార్లు పనిమనిషి తలుపు తట్టి చూసినాగాని --- డాక్టర్‌కేమైందోనన్న ఆందోళనతో తల్లిదండ్రుల కావిషయం తెలిపాడు పనిమనిషి. మామూలుగా ఏడుగంటలకే భరత్ భూషణ్ నిద్రలేస్తాడు. అందుకే ఆ తల్లిదండ్రులంతగా కలవర పడలేదు. ''అతను బాత్రూంకు వెళ్ళి ఉంటాడు'' అని వాళ్ళు తెలుపుతున్నా పనిమనిషికి గాభరా తగ్గలేదు. ''నేను తలుపును మూడుసార్లు గట్టిగా కొట్టి చూశాను, అబ్బాయిగారు బాత్రూంలో ఉన్నా పలికేవారు'' అని మరింత కంగారుతో అతను చెప్తుంటే ఆ తల్లిదండ్రులకు గూడా కొద్దిగా భయంకల్గింది. వాళ్ళుగూడా వెళ్ళి అబ్బాయి గదితలుపును గట్టిగా తట్టి పిలిచినా, లోపలనుండి ఎటువంటి ప్రత్యుత్తరం రాకపోగా, బలవంతాన తలుపుల్ని తెరవటం జరిగింది.

భరత్ భూషణ్ గాఢ నిద్రలో ఉన్నట్లుగా తల్లిదండ్రుల కన్పించింది. దగ్గరకిపోయి తట్టి చూడగా అతనిలో ఏచలనంలేదు, ఆత్రుతతో కొడుకు ముక్కు దగ్గర వేలు పెట్టి చూసిన తండ్రిగుండె ఆగినంత పనైంది; విషయం గ్రహించని తల్లి కొడుకు శవంపై పడి భోరున విలపించసాగింది. తండ్రి ప్రక్కింటిలో ఉన్న డాక్టర్‌ను పిల్చుకు వచ్చాడు. భరత్ భూషణ్‌ను పరిశీలించిన డాక్టర్ అతను చనిపోయిన విషయాన్ని నిర్ధారించాడు. అంతవరకూ దుఃఖాన్ని దిగమ్రింగి నిబ్బరంగా ఉన్నట్లు కన్పించిన ఆ తండ్రి గూడా భార్యతోపాటు పెద్దగా రోదించసాగాడు.

పోలీసులు అక్కడికి రాకముందే ఎలిజబెత్, ఆమె తల్లిదండ్రులు అక్కడికి రావడం జరిగింది. తట్టుకోలేని దుఃఖంతో, ఆ పెళ్ళి కూతురు, చలన రహితమైన అతని శరీరంపై పడి పెద్దగా ఏడ్చింది. ఇద్దరు, ముగ్గురు కలిసి బలవంతంగా ఆమెనుపైకితీయగా, మెల్లగా అబోధావస్థలోకి జారిపోయింది. దానితో పక్కింటి డాక్టరుకు పని ఎక్కువయింది. స్పృహలోకి తిరిగి రాగానే, ఒక మాదిరి హిస్టీరియా వచ్చినట్టు ఆమె ప్రవర్తించగా, ఎంతో మంచివాడైన ఆ డాక్టరు ఆమెను తన ఇంటికి తీసుకువెళ్లి, ఏదో ఇంజక్షన్ ఇచ్చి నిద్రపోయేటట్టు చేశాడు. ఇంక్వెస్టు, పోస్టుమార్టమ్‌లు అంతా అయింతర్వాత, సరిగ్గా వివాహ ముహూర్తానికి ముందు వరుడి అంత్యక్రియలు గూడా పూర్తయ్యాయి. ఆ సమయంలో ఎలిజబెత్, నిద్రమందు ఇంజక్షన్ ప్రభావం వల్ల, ఇంకా సుఖ నిద్రలోనే వుంది.

పోస్టుమార్టమ్ మరియు పరిస్థితులు సూచించిన సాక్ష్యాధారాల వల్ల, క్రితంరోజు రాత్రి భరత్ భూషణ్ అతిగా మత్తుమందు ఇంజక్ట్ చేసుకోవడం వల్లనే అతనికి అనంతశయనం ప్రాప్తించిందనే నిగమనానికి రావడానికి పోలీసులకు, డాక్టర్లకు పెద్ద కష్టమేమి కలుగలేదు.

* * * *

కాలం ఎవరికొరకు వేచివుండదు. శరీరానికి తగిలిన గాయాలు మానడానికి పది, పదిహేను రోజులు పట్టొచ్చు. కాని, ఎలిజబెత్ మనసుకు ఏర్పడిన అగాధక్షతానికి ఉపశమనం కలగడానికి పది, పదిహేను నెలలు పట్టింది. ఆమె మెల్లమెల్లగా పాతజీవన విధానంలోకి వెళ్ళడం మొదలు పెట్టింది. ఆమె మందహాసంలో ఏర్పడిన వేదనాఛ్ఛవి క్రమక్రమంగా తిరోధానం కావడానికి, ఒకటిన్నర సంవత్సరం పట్టింది. ఆ వేదనాఛ్ఛవిని పూర్తిగా తుడిచిపెట్టిన వ్యక్తి వేరే ఎవరోకాదు డాక్టర్ ఫ్రాన్సిస్ జోసెఫ్, ఎం.డి. త్రాగుడు అలవాటు లేని ఆ డాక్టరుకు, ఎలిజబెత్‌తో మాట్లాడడంలోనే కిక్ వచ్చేది. అతడు, ఆమెతో మాట్లాడుతూ కూర్చునే సమయంలో తన్నుతాను మరచిపోయేవాడు. కాని, ఇతర డాక్టర్లు

ఆమెతో మాట్లాడుతూ వుంటే, అతనిలో ఈర్ష్యాభావం పడగ విప్పేది. అప్పుడప్పుడు అతను ఎలిజబెత్ ఇంటికి వెళ్లేవాడు. కాలక్రమేణా, అతను ఆ ఇంటికి ఒక నిత్య సందర్శకుడిగా రూపాంతరం చెందాడు. ఎలిజబెత్ తల్లిదండ్రులకు అతను బాగా నచ్చాడు. ముప్పైరెండు సంవత్సరాలయినా అతను బ్యాచ్‌లర్‌గా వుండడం తమ కూతురు అదృష్టంగా వాళ్లు భావించారు. తన ముగ్గురు చెల్లెళ్ల వివాహము అయిన తర్వాతనే, తను పెళ్లి చేసుకుంటానని నిర్ణయించుకున్న ఆ యువ డాక్టరు ఎంత మంచివాడు! ఎంతటి కుటుంబాభిమాని. ముగ్గురు చెల్లెళ్లకు మంచి సంబంధాలు చేసిన తర్వాతనే ఎలిజబెత్‌పై మక్కువ పడ్డాడు. అన్ని విధాలుగా తను కూతురికి అనుయోజ్యుడైన ఒక భర్తగా అతనుంటాడని నమ్మకం కుదిరిన ఆ తల్లిదండ్రులు ఏసు ప్రభువుకు ధన్యవాదాలు తెలియజేసుకున్నారు. ఆ విధంగా వాళ్ల పెళ్లి నిశ్చయింపబడినది.

డిసెంబర్ పదిహేనవ తేది ఉదయం హైదరాబాదలో ఒక ప్రశస్తమైన క్రైస్తవ దేవాలయంలో వాళ్ల వివాహం జరుగుతుందనే సమాచారం, వధూవరుల వివాహ ఆహ్వాన పత్రికల ద్వారా చాలామంది డాక్టర్లకు, నర్సులకు, రోగులకు కొంతమంది రోగం లేనివాళ్లకు కూడా లభ్యమైంది.

ఆ రోజు ఎలిజబత్ ధరించాల్సిన ప్రత్యేకమైన పెళ్లి దుస్తులు తయారు చేయబడ్డాయి. ఆహ్లాదాతిరేకం వల్ల ఆమె పాదాలు నేలనంటడం లేదు. మధువిధు గురించి మధుర కథలు చెప్పి, ఆమె స్నేహితురాండ్రు ఆమెకు గిలిగింతలు పెట్టి ఊపిరి సలపకుండా చేశారు. కొంత మంది పరాజిత ప్రేమికులు జోసెఫ్ ప్రణయ భాగ్యం గురించి అసూయ పడ్డారు. ఆ అసూయలో మరగడం వల్ల వాళ్ల లోపలనుంచి వేడి నిట్టూర్పులనే బుద్బుదాలు ఉద్భవించాయి.

డిసెంబర్ పదమూడవ తేది రాత్రి ఎలిజబెత్ స్పృహతప్పి నేలమీద పడిపోయింది. ఇంతటి హృదయ భేద్యమైన దురంత వృత్తాంతాన్ని వినటానికి ఆమెకు శక్తి లేకపోయింది. తన వివాహానికి కొందరు బంధు మిత్రాదులను ప్రత్యేకంగా ఆహ్వానించటానికి తల్లిదండ్రులతో కలిసి విజయవాడకు వెళ్ళిన డాక్టర్ ఫ్రాన్సిస్ జోసెఫ్ తిరిగి కారులో హైద్రాబాద్‌కు వస్తుండగా ఒకలారీ యాక్సిడెంట్ లో జోసెఫ్‌తోపాటు అతని తల్లిదండ్రులుగూడా ప్రాణాలుకోల్పోయారన్నదే ఆ దారుణ వార్త.

ఒక సంవత్సరం కాలంపాటు ఎలిజబత్ ముఖంలో చిరునవ్వు జాడేలేకుండా పోయింది. ఆ సంఘటన జరిగిన మూడు, నాలుగు నెలలవరకూ ఆమె గుండెను పిండిచేస్తున్న వేదనంతా ముఖంలో ప్రస్ఫుటం కాసాగింది. ఆనాలుగు నెలల్లో మొదటి మూడునెలల కాలం ఆమె

లీవులో ఉండిపోయింది. ఇంటిలో ఆమెను ఓదార్చటానికి గాని, ఉపశమన వాక్యాలు చెప్పటానికిగాని ఎవరూ లేరు. ఎందుకంటే ఈ రెండో వరుడు గూడా హఠాత్తుగా మరణించటంతో ఆమె తల్లిదండ్రులు హతాశులై మంచాలకే కట్టుబడిపోయారు.

మవునంగా కాలంగడుపుతున్న తండ్రికన్నులెప్పుడూ కన్నీరును వర్షిస్తూ ఉండేవి. కూతురు దుర్గతిని తల్చుకొని పెద్దగా శోకిస్తూ ఉండటమేగానీ, దేవుణ్ణిగూడా శాపనార్థాలు పెడుతూ ఉండేది తల్లి. మూడు నెలల కాలంగడిచిన తర్వాత ఆమెతో పనిచేసే డాక్టర్లూ, నర్సులూ అనునయవాక్యాలు చెప్తూ మళ్ళీ ఆమెను ఆస్పత్రికి రమ్మనమని కోరేవారు.

వీళ్ళు కోరినట్లుగానే మూడు నెలల తర్వాత ఆమె మళ్ళీ ఆస్పత్రిలో జాయినయ్యింది. వాడిపోయిన ఆమె ముఖం చూసి సహ ఉద్యోగులకు ఆమెపట్ల సానుభూతి పెరిగింది. విధినిర్వహణలో నిమగ్నురాలై పోవటంతో ఆమెలోని విషాద తీవ్రత కొంత తగ్గిపోయింది రోగులకు సేవచేసే సత్కార్యం కోసమే దేవుడు తనను ఈ లోకంలో ఉంచినట్లుగా ఆమెలో ఒక నూతన విశ్వాసం కల్గింది. లోగడ ఆవిశ్వాసం ఆమెలో లేదనికాదు; ఆర్తులకు శుశ్రూష చేయాలన్న అభిలాష ఆమెలో గతంలో ఉన్నా, ఆటపాటలలో నూ, ముద్దుముచ్చట్లలోనే ఆమె అధికంగా కాలంగడిపేది. యువకులు, మధ్యవయస్కులు తన అందాన్ని చూసి గుటకలు మింగటం గమనించి ఆమెలోలోన విరగబడి నవ్వుకొనేది. ఎవరైనా యువకుడు తన పట్ల అలక్ష్యం ప్రదర్శిస్తే, శారీరకంగానో, మానసికంగానో అతనిలో ఏదో లోపముందన్న నిర్ధారణ కొచ్చేది ఆమె. తన చిరు దరహాసంతోనూ, కడకంటి చూపుతోనూ ఎందరో రూపసులైన యువకులకు తాను సుఖనిద్ర లేకుండా చేస్తున్నాననీ, విమానం లేకుండా సంచరించే ఎయిర్ హోస్టెస్ వంటిది తానైతే, ఆ యువకులందరూ తన చుట్టూ పరిభ్రమించే మేఘ శకలాల వంటి వారనీ ఆమెలో ఒక భావం ప్రబలంగా ఉండేది.

కానీ క్రూరమైన విధి ఆమె మనసును తునాతునకలు చేసింది. తన జీవితంలో ఇహ ప్రభావాలుండవు, వెన్నెల పాడే ఉండదు, సంగీత మధురిమలుండవు, నృత్యముండదు, ఆశల ప్రశ్నే ఉదయించదు, కోరికల ప్రసక్తే లేదు, శీతలత్వం ఉండదు, పులకరింతలే ఉండవు అని తలచుకొని తలచుకొని తన తల వ్రాతకు దురపిల్లేది. రోగుల నిస్వార్థ సేవకు తాను సంపూర్ణంగా అర్పణం అయ్యే అవకాశం ఇచ్చి నందుకు ఆమె దేవుని స్తుతించేది, తన జీవితానికి ఒక కొత్త అర్థమేర్పడినట్లుగా ఆమె భావించేది. తన వ్యక్తి గతమైన దుఃఖాన్ని మర్చిపోవటానికి దేవుడు చూపించిన ఒక మహత్తరమైన మార్గమేకదా ఇది! తనకన్నా అధిక దుఃఖార్తులు ఈ ప్రపంచంలో ఉన్నారన్న సత్యాన్ని ఆకారుణ్యమూర్తి తన కళ్ళకు చెవులకు గ్రాహ్యమయ్యేట్టుగా చేస్తున్నాడు. ''పరోపకారార్థమిదం శరీరం'' అన్న దయాపూరిత సేవా

భావం తన మనసులో సుళ్ళు తిరుగుతూ ఉంది. నిస్వార్థమైన మానవసేవలో తన శేష జీవితాన్ని సార్థకంచేసుకోవాలని ఆమె నిర్ణయించు కొంది. తద్వారా ఆమె మనోవేదనకు కొంత ఉపశమనం లభించింది.

కానీ ఆమె ఆరాధక బృందం ఆమెను అలా వదిలిపెడతారా? కొందరు యువకులు తుమ్మెదల మాదిరి ఝుంకారంచేస్తూ ఆ మకరంద స్రోత స్సుచుట్టు ప్రదక్షిణాలు చేయటం ప్రారంభించారు. చిరునవ్వు మీద అలకవహించి ఇంకా ఎంతకాలం ఆమె గడుపుతుంది! మెల్ల మెల్లగా ఇద్దరు ముగ్గురు యువకులైన డాక్టర్లు ఆమెలో గిలిగింతలు పులకరింతల బీజాలు నాటసాగారు. ''పరోపకారార్థమే ఈ యవ్వన శరీరం'' అన్న పరమసత్యాన్ని ఆమె అవగాహన చేసికోనేట్లు వాళ్ళు ప్రేరేపించారు. నిన్నటి దినాల్ని మర్చిపోవటానికి, భవిష్యత్తును గూర్చి భయంచెందకుండా ఉండటానికి, వర్తమానాన్ని వీలైనంతంగా ఆస్వాదించటానికి ఆమెకు వాళ్ళు గురూపదేశం చేశారు. ఆమెరక్తమాంసాలకు ఇంకా ఎక్కువ కాలం లోక సహజమైన ప్రలోభాలకు లొంగి పోకుండా ఉండటం సాధ్యంకాలేదు.

ఒకవిషయం ఆమెకు బాగా అర్థమైపోయింది...... ఇంక ఎవ్వరూ తనను వివాహమాడటానికి ధైర్యంగా ముందుకు రాలేరు, రహస్యంగా ఒక జ్యోతిష్యుణ్ణిగూడా ఆమె సంప్రదించింది. ఆమెకు వివాహ యోగం లేనేలేదని అతను స్పష్టంగా చెప్పాడు. అయినా గాని ప్రాపంచిక సుఖాల విషయంలో ఆమెకు ఏకొరతా ఉండదని వెటకారపు నవ్వుతో తెలియజేశాడతను. దక్షిణగా ఆమె ఇచ్చిన డబ్బును పుచ్చుకోనేప్పుడు ఆమె అంగుళీ పుష్పాలను స్పర్శించటంలో అతను అద్భుతమైన హస్తకళా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. అతను అంతటితోనే సరిపెట్టుకొన్నాడా? ఆమె ముందే ఆ డబ్బును తనకళ్ళ కద్దుకొన్నాడు. ఆమె వెళ్ళింతర్వాత ఆమె అంగుళీస్పర్శన భాగ్యం పొందిన తన కరాగ్రాన్ని మూడు సార్లు చుంబించాడు.

కాలంగడిచిన కొద్దీ ఆమె మిత్రుల సంఖ్య అధికమైంది; దానితోపాటు ఆమె ఇంట్లో సుఖ ఐశ్వర్య సామాగ్రుల సమృద్ధిగూడా పెరిగింది. కూతురు స్నేహితుల రాకపోకల గూర్చి తల్లిదండ్రులు ఎటువంటి అభ్యంతరం పెట్టలేదు. ఆమెకు మరో వివాహం జరపటం అసాధ్యమన్న విషయం వాళ్ళకు తెలుసు. ఈ పరిస్థితుల్లో ఆ తరుణి తనుక్షేత్రం ఒక ఎడారి క్షేత్రంగా ఉండిపోవాలని కోరుకోవటం ఏం భావ్యం?

దాదాపు అందరు ఆసుపత్రిలో మగవాళ్ళందరికీ, ఆడవాళ్ళకూ ఆమె అంటే ఎంతో ఇష్టం. మిత్రులు ఆమె చుట్టూచేరి ముచ్చట్లు పెడుతూ ఉండటం అక్కడ సాధారణంగా కన్పించే దృశ్యమే. ఆసుపత్రి సుపరింటెండెంట్ అయిన డాక్టర్ రామలింగేశ్వర రావుకు

అటువంటి ముచ్చట్లంటే అసలు ఇష్టముండేదే కాదు. రెండుమూడు పర్యాయాలు అతడు ఆమెను పిల్చి హెచ్చరించటం జరిగింది. అతని రంగు తెలుపైనా ఎప్పుడూ అమావాశ్య రాత్రి ముఖభంగిమతో తిరిగే ఆ అర్థశతక మలబద్ధ జీవిని గూర్చి ఆ ఆసుపత్రి సిబ్బంది అందరూ ఏవేవో చెప్పుకొని పగలబడి నవ్వుకొనేవారు. సంతాన భాగ్యం లేకుండా సంతాన లక్ష్మిగా కాలంగడిపే భార్య ఎన్నడూ నవ్వగూడదనీ, సినిమా చూడటంగానీ, రేడియో వినటంగాని చేయకూడదని ఇంట్లోగూడా ఆ నిర్దయుడు ఆంక్షల్నివిధించాడు. ఆ రామలింగడి భార్య పాతివ్రత్యా భారమే మోయకపోతే ''అధిక సంతాన ప్రాప్తిరస్తు'' రాలిగా కాకపోయినా కనీసం ఇద్దరు ముగ్గురు పిల్లలకైనా అనాయాసంగా తల్లి అయి ఉండేది. వివాహమైన ఒక్క నెలలోపలే రామలింగడి పడక, అతని భార్య పడక వేరువేరైనాయి. భార్య దగ్గర పడుకొంటే రాత్రంతా అతనికి తుమ్ములు వచ్చేవి --- ఇదో వింతరకమైన అలర్జీ. ఆవిధంగా ఆ ఇంట్లో మిడ్‌వైఫ్‌గానే ఆవైఫ్ ఉండిపోయింది.

అటువంటి డాక్టర్ రామలింగడికి ఎలిజబెత్ ఆర్జించిన జనప్రీతి గూర్చి అసూయ కలగటం, ఆమె అపురూప సౌందర్యంపట్ల ఎటువంటి అభిరుచి కలగకుండా ఉండటం ఇవి రెండుగూడా సహజ పరిణామాలే. చాలామంది స్నేహితులతో కల్సి ఆమె ఉల్లాసభరితంగా కాలంగడపడం చూసి, దీనిని క్రమశిక్షణారాహిత్యంగా అతను పేర్కొనటంలో ఆశ్చర్యమేమీలేదు. చివరకు మూడొందల కిలోమీటర్ల దూరంలో ఉన్న వేరే ఆసుపత్రికి ఆమె బదిలీ అయింది. వేరే ఆసుపత్రిలో పని చేయగూడదన్న పట్టింపు ఆమె కేమీలేదు; కానీ రోగ గ్రస్తులైన తల్లిదండ్రుల్ని విడిచిపెట్టి దూరంగా వెళ్ళి పోవటం ఆమెకిష్టం లేదు. ఈ కారణంవల్లనే ఆమె ఈ బదిలీకి వ్యతిరేకంగా అప్పీలు చేసుకొంది. ఆమె దగ్గర మిత్రుడొకడు ఆమెను మెడికల్ డైరెక్టర్‌కు పరిచయం చేశాడు. ఆపరిచయం చేసిన ప్రత్యేక ప్రభావంవల్ల కావచ్చు ''ఎలి-కామేశ్వర'' సమ్మేళనాలు పదే పదే జరిగినై. ఆమె బదిలీ ఉత్తర్వు రద్దయింది --- డాక్టర్ రామలింగడికి మాత్రం బదిలీ ఉత్తర్వు లందినై. ఇప్పుడు మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో ఏ ట్రాన్స్‌ఫర్ కావాలన్నా, ఆగిపోవాలన్నా ''ఎలీ'' అనుకొంటేచాలు. కానీ ఆడిపార్ట్‌మెంట్ అధిపతికి ఆమె ఇటువంటి తలనొప్పి రోజూ ఇచ్చేదికాదు. అత్యవసరమైన విషయాలకు మాత్రమే ఆమె కామేశ్వర రావు వద్దకు వెళ్ళేది స్వయంగా వెళ్ళకుండా గూడా కార్యాలు సాధించటానికి ఆమెకు ఒక మార్గం ఉండేది.

అదేమిటో తెలుసుకోవాలని ఉన్నదికదా మీకు?

ఆమెను తీసుకుపోయి కామ రాజుకు --- కాదు --- కామేశ్వరుడుకు పరిచయం చేసిన వ్యక్తి పేరు డాక్టర్ మహమూద్. చాలామంది ప్రేమతో అతణ్ణి మోహబూబ్ అని

పిలచేవారు. చాలా దౌర్బల్యాలకు అధిపతి ఆ నలభై ఏండ్ల డాక్టర్. కాని అతని అతిబలవంతమైన బలహీనతే ఎలిజబెత్. కానీ ఒక్క విషయం, చచ్చినా అతను ఎలిజబెత్‌ను 'నిక్కా' మాత్రం చేసుకోడు. ఎందుకంటే నిక్కా చేస్తారని అనుకుంటేనే గతంలో వాళ్ళిద్దరివలే తనూ చచ్చిపోతాడు గదా? మహమూద్‌కు మొహబత్ చేయటానికి ఎన్నో సంవత్సరాలు ఇంకా మిగిలి ఉంటే, ఇప్పుడే అతనెందుకు అల్లాహ్‌కు ప్యారా'' కావాలి? అతనికున్న ఒకే ఒక భార్యకు మంచి పుష్టిగల తొమ్మిది మంది పిల్లలు ఉన్నారు. పందొమ్మిది నుండి మూడు సంవత్సరముల వయస్సు వరకూ ఉన్న ఆ తొమ్మిది మంది పిల్లలతో ఆమె చాలా సంతృప్తితో ఉంది. ప్రసవించీ, ప్రసవించి విసుగుచెందినట్లు ఒక నిరసన ధ్వని ఆమె మాటల్లో చేతల్లో అధికంగా బహిర్గతం కావటంవల్ల, కనీసం ఆమె ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా ఆ డాక్టర్‌కు పరస్త్రీలతో సంపర్కం తప్పనిసరైంది. తన అవసర నివృత్తి కొఱకు రతిసాగరంలో తేలిఆడుతున్న అతనికి భాగ్యవశాత్తూ లభ్యపడిన మరకత ద్వీపమే ఎలిజబెత్.

ఎలిజబెత్‌కు కూడా తనమనిషి అని చెప్పుకోవటానికి ఒక పురుషుడి అవసరంఎంతో ఉంది. -- తన అవసరాలన్నీ తీరుస్తున్న -- తన అవసరాలకు పనికివస్తున్న -- తనకూ తన తల్లిదండ్రులకు అండగా ఉంటున్న మగదిక్కు; వారంలో కనీసం మూడు నాలుగు రోజులు ఆ ఇంట్లోనే పడుకొంటాడు. అతని నుండి ఆమె చాలా పొందగలిగింది - ప్రత్యేకించి ధనరూపేణా; ఆమె ద్వారా డాక్టర్ మహమూద్‌కు కూడా చాలా కల్సివచ్చింది - శారీరక సుఖంతోపాటు, ఆర్థిక లబ్ధికూడా. అదెట్లా అంటే ---

ఛీ -- ఛ -- ఈ జోడీ తల్చుకొంటే మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో ఒక్క బదిలీలేనా జరిగేది? ఈ డిపార్ట్‌మెంట్‌కు అవసరమైనవి సప్లై చేయటానికి పెద్ద పెద్ద కాంట్రాక్టర్లున్న విషయం మీకు తెల్సుకదా! సమయ సందర్భాలను బట్టి వాళ్ళకు కావాల్సిన సహాయమంతా చేసి పెట్టటం ఈ అవివాహిత దంపతుల బాధ్యతకదా!

అదీ కాకుండా, ఈ మెడికల్ డిపార్ట్‌మెంట్ అంటే అనేక ఇతర డిపార్ట్ మెంట్స్‌తో అల్లుకుపోయి ఉంటుంది. అలా ఉండటం చేత ఈ మతాతీత మిధునాల ప్రభావం సమాజంలో చాలామంది ఉన్నత వ్యక్తుల అతిధి గృహాల్లో చీకటి వెలుగులకు కారణమవుతుంది.

ఏది ఏమైనా ఎలిజబెత్‌కు తన జీవితంలో ఎటువంటి బాదర బందీలుగానీ అసంతృప్తులుగానీ లేవు. తానొక ద్వితీయ భార్యననిగానీ, ఉంచుకోబడ్డ స్త్రీననిగాని పిలవబడటంలో ఆమెకే నామోషీ లేదు. ఇంకా కొందరు వ్యక్తులు ''కాల్‌గర్ల్'' ''గరల్‌ఫ్రెండ్'' అని ఆ క్షేపించినా ఆమె పట్టించుకోదు. జీవితాని కవసరమైనవన్నీ

సమకూరినై. పెద్దమేడ, కారు, డ్రైవర్, పనిమనుషులు ఈ హంగులన్నీ ఏర్పడ్డాయి. అవసరానికి మించిన ధనం ఉంది. ఈ జీవితంలో ఇంకా పొందదగింది ఏదైనా ఉంటే అది మాతృత్వమనే మహాభాగ్యం మాత్రమే. కానీ ఆ గొప్ప అదృష్టం పొందలేని వేలాదిమంది స్త్రీలు ఈ ప్రపంచంలో లేరా? మతపరంగా సన్యాసత్వంగానీ, కన్యా స్త్రీత్వంగానీ స్వీకరించని వాళ్ళ జీవితం అసం పూర్ణమని వ్యాఖ్యానించటం అసమంజసం కాదా?

ఏ ఒక్క మనిషికైనా ఆశించినవన్నీ లభ్యంకావు. తను ప్రస్తుతం అనుభవిస్తున్న ఈ ఒకే ఒకలోటు ఇట్లాగే ఉండిపోతే మరేంఫర్వాలేదన్న భావం ఆమెకేర్పడింది.

డాక్టర్ మహమూద్‌గూడా తక్కువ వాడేంకాడు, చాలా మంచివ్యక్తి. ఎలిజబెత్‌ను అతను మనస్ఫూర్తిగానే ప్రేమిస్తున్నాడు. ఆమెలేని జీవితం గూర్చి ఊహించటంగూడా అతనికి సాధ్యంకాదు.

రోజూ ఆమెతన దగ్గరే ఉండాలన్నది అతని కోరిక. మనసుతో, శరీరంతో అతను ఆమెను ఆరాధిస్తున్నాడు. అయినా గానీ, ఎలిజబెత్ ఎల్లప్పుడూ తన సొమ్ముగానే ఉండిపోవాలన్న పట్టుదల అతనికి లేదు. ''అందమైన ఒకవస్తువు ఎల్లప్పుడూ సంతోష దాయకంగా ఉంటుంది.'' అని లోగడ ఆంగ్లంలో ఎవరో అన్నారు. మన డాక్టర్ మహమూద్ ఈ సత్యాన్ని మనసారా నమ్ముతున్నాడు. ఎల్లప్పుడూ సంతోషదాయకమైన ఆవస్తువు తనకు మాత్రమే పరిమితమై ఉండిపోవాలన్న సంకుచిత మనస్తత్వం అతనికి లేదు. నిజజీవితంలో తానెంత స్వతంత్రంగా వ్యవహరించాలని కోరుకొంటాడో, అదే స్వాతంత్ర్యాన్ని ఎలిజబత్‌కు కూడా అందజేసే గొప్ప సమతావాది అతను. ''బ్రతుకు, బ్రతుకనివ్వు'' అన్నదే అతని జీవిత లక్ష్యం. మతంఏదైనా ''సర్వేజనాః సుఖినోభవంతు'' అన్నది అతి ఉత్కృష్టమైన ఆశయంకదా!

---